

SRI MAHA SIDDHA ASHRAM

శక్తిపాత సిద్ధ మహాయోగం - మార్గ పరిచయం


SAKTHI JAGARANA
MOKSHA SADHANA
SARANAGATHI
ATHMA GNANAM
SRI MAHA SIDDHA ASHRAM
S M S A



స్వాగతం

మనిషి జీవితంలో ఎన్నో విజయాలు సాధించినా, అనేక అనుభవాలను పొందినా, ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకున్నా, అతని అంతరంగంలో ఒక లోతైన అన్వేషణ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. బాహ్య ప్రపంచంలోని సుఖసంతోషాలు, విజయాలు, భౌతిక సంపదలు తాత్కాలిక సంతృప్తిని అందించినప్పటికీ, జీవితానికి నిజమైన అర్థం ఏమిటి? మన అసలైన స్వరూపం ఏమిటి? మనలో అంతర్లీనంగా ఉన్న శాంతి, ఆనందం మరియు చైతన్యాన్ని ఎలా అనుభవించగలం? అనే ప్రశ్నలు ప్రతి ఆత్మాన్వేషకుడి హృదయంలో ఏదో ఒక దశలో ఉదయిస్తాయి.

ఈ ప్రశ్నలకు సమాధానాన్ని బాహ్య ప్రపంచంలో కాకుండా, తన అంతరంగంలో అన్వేషించాలనే తపన కలిగిన సాధకుల కోసం భారతీయ ప్రాచీన ఆధ్యాత్మిక సాంప్రదాయాలు అనేక ఉన్నతమైన సాధనా మార్గాలను అందించాయి. తనను తాను తెలుసుకోవడం అనే ఆత్మాన్వేషణను మానవ జీవితంలోని అత్యున్నత లక్ష్యంగా ప్రతిపాదించింది.

ప్రపంచ ప్రాచీన ఆధ్యాత్మిక నాగరికతలలో భారతదేశం ఒక ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. అనాదికాలం నుండి భారతదేశం ఆధ్యాత్మిక అన్వేషణ, తాత్త్విక చింతన, యోగ సంప్రదాయాలకు కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ పుణ్యభూమిలో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత వంటి శాశ్వత జ్ఞాన సంపదలు ఆవిర్భవించాయి. మహర్షులు, యోగులు, సిద్ధపురుషులు తమ జీవితాలను ఆత్మసాధనకు అంకితం చేసి మానవాళికి అమూల్యమైన మార్గదర్శకత్వాన్ని అందించారు.



భారతీయ ఆధ్యాత్మిక దృక్పథం బాహ్య విజయాల కంటే అంతరంగ వికాసానికి, భౌతిక సంపద కంటే ఆత్మసంపదకు, తాత్కాలిక సుఖాల కంటే శాశ్వత శాంతికి మరియు పరమానందానికి ప్రాధాన్యతను ఇచ్చింది. “తనను తాను తెలుసుకోవడం” అనే ఆత్మాన్వేషణను మానవ జీవితంలోని అత్యున్నత లక్ష్యంగా ప్రతిపాదించింది. ఈ ఆత్మాన్వేషణ పరిపూర్ణతను పొందాలంటే, కర్మచక్ర బంధాల నుంచి విముక్తి కలిగించే కుండలినీ శక్తి జాగృతి (శక్తిపాతం) తప్పనిసరిగా జరగాలని భారతీయ ఆధ్యాత్మిక తత్వం పేర్కొంది.

ఇక్కడ మీరు శక్తిపాతం అంటే ఏమిటి, దీని లక్ష్యము,గురుపరంపర ప్రాముఖ్యత ,ఈ సాధన మార్గం యొక్క విశిష్టత అలాగే సాధకుని ఆధ్యాత్మిక ప్రయాణానికి కుండలినీ శక్తి జాగరణ తప్పనిసరి ఎందుకు అనే వాటికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను తెలుసుకోబోతున్నారు.

మీరు ఏ దేశానికి చెందిన వారైనా, ఏ సంస్కృతికి చెందిన వారైనా, ఏ మతాన్ని అనుసరిస్తున్న వారైనా లేదా ఏ మతానికి చెందని వారైనా నిజాయితీతో ఆధ్యాత్మిక సత్యాన్ని అన్వేషించాలని ఆసక్తి ఉంటే ఈ మార్గాన్ని తెలుసుకునే అవకాశం మీకు అందుబాటులో ఉంది.

మీలో ఆధ్యాత్మిక ఆలోచనలకు, లోతైన ఆత్మ పరిశీలనకు, అంతర్ముఖ ప్రయాణానికి ఒక స్ఫూర్తిదాయక ఆరంభం కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.

మీ ఆధ్యాత్మిక ప్రయాణానికి హృదయపూర్వక స్వాగతం.



ఈ ఆశ్రమం సనాతనమైన శక్తిపాత సిద్ధ మహాయోగ సాంప్రదాయాన్ని పరిరక్షించి, గురు పరంపరానుగతంగా వస్తున్న అనుభవపూర్వకమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని యథాతథంగా ప్రపంచానికి పరిచయం చేయడానికి, ప్రతీ జిజ్ఞాసువుకు అందించడానికి అంకితభావంతో నిరంతరం కృషి చేస్తోంది.

సిద్ధ గురువు అనుగ్రహంతో శక్తిపాతం ద్వారా కుండలినీ శక్తి జాగృతి అయి, నిత్య ధ్యాన సాధన, అంతర్ముఖ ప్రయాణము,నిత్య సత్సంగాల ద్వారా సిద్ధ గురువు మార్గ దర్శనము మరియు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందుతూ ఆత్మసాక్షాత్కారాన్ని జీవిత పరమావధిగా స్వీకరించిన ప్రతీ సాధకునికి ఈ ఆశ్రమం ఒక ఆధ్యాత్మిక నిలయం.

ఈ మహోన్నత సాంప్రదాయాలలో కర్మ, భక్తి, జ్ఞాన, లయ, రాజయోగము వంటి అనేక యోగ మార్గాలు రూపుదిద్దుకొని లక్షలాదిమంది సాధకులకు ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శకంగా నిలిచాయి.ఈ గురు పరంపరలలో అభివృద్ధి చెందిన విశిష్టమైన ప్రాచీన సాధనా విధానాలలో శక్తిపాత సిద్ధ మహాయోగము అత్యంత శక్తివంతమైనది మరియు సులువైనది. భక్తి, జ్ఞాన, క్రియా వంటి అనేక సాధనా మార్గాలు అంతర్లీనంగా ఉన్నాయి కాబట్టి ఇది **మహాయోగంగా** పిలవబడుతోంది.



శ్రీ మహా సిద్ధ ఆశ్రమం ఈ ప్రాచీన గురుపరంపర స్ఫూర్తితో శక్తిపాత సిద్ధ మహాయోగాన్ని పరిచయం చేస్తూ, ప్రతి సాధకుడు తనలోని దివ్య చైతన్యాన్ని అనుభవించి, అంతర్ముఖ శాంతి, ఆధ్యాత్మిక వికాసం మరియు ఆత్మసాక్షాత్కారం వైపు ప్రయాణించేందుకు మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది.

“అంతర్ముఖతే ఆధ్యాత్మిక వికాసానికి ద్వారం; గురుకృప ఆ ప్రయాణాన్ని ప్రకాశవంతం చేసే దివ్య మార్గదర్శకం”

వేదాంత దృక్పథం : – తాత్త్విక పునాది

భారతీయ ప్రాచీన యోగ–వేదాంత సాంప్రదాయాల సారాన్ని గురుపరంపర ద్వారా అందించే విశిష్టమైన ఆధ్యాత్మిక సాధనా మార్గం. వేదాంతం ప్రతిపాదించిన ఆత్మతత్త్వం, యోగశాస్త్రం వివరించిన చైతన్య వికాసం ఈ మార్గానికి ప్రధాన తాత్త్విక ఆధారాలు. ప్రతి జీవిలోనూ అంతర్లీనంగా ఉన్న పరమచైతన్యాన్ని తెలుసుకోవడమే మానవ జీవిత పరమార్థమని ఉపనిషత్తులు బోధిస్తాయి. ఈ జ్ఞానాన్ని కేవలం బౌద్ధిక అవగాహనకే పరిమితం చేయకుండా, ధ్యానసాధన ద్వారా స్వీయ అనుభవంగా మలచుకోవడానికి శక్తిపాత సిద్ధ మహాయోగం ప్రాధాన్యతనిస్తుంది.



భారతీయ యోగ సాంప్రదాయంలో రాజయోగం, భక్తియోగం, కర్మయోగం, జ్ఞానయోగం, లయయోగం వంటి అనేక సాధనా విధానాలు అభివృద్ధి చెందాయి. ఇవి మానవుని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి విభిన్న మార్గాలను సూచిస్తాయి. ఈ సాంప్రదాయాల స్ఫూర్తితో శక్తిపాత సిద్ధ మహాయోగం ధ్యానాన్ని ప్రధాన సాధనగా స్వీకరించి, గురుకృప ద్వారా సాధకునిలో అంతర్లీనంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తి మేల్కొలుపునకు మార్గం చూపుతుంది. ఈ సాధనలో శక్తిజాగరణతో పాటు నిత్య ధ్యానాభ్యాసం, స్వీయ పరిశీలన, గురువు పట్ల విశ్వాసం, వినయం, శరణాగతి కీలకమైన అంశాలుగా నిలుస్తాయి. నిరంతర సాధన ద్వారా సాధకుడు తన అంతరంగాన్ని పరిశీలించుకుంటూ, జీవితంలో ప్రశాంతత, స్థిరత్వం, వివేకాన్ని పెంపొందించుకునే దిశగా పయనిస్తాడు. గురుపరంపర అందించే మార్గదర్శకత్వం ఈ ప్రయాణంలో సాధకుడికి దిశానిర్దేశం చేస్తుంది. అంతిమంగా తన నిజమైన స్వస్వరూపాన్ని తెలుసుకొని, ఆత్మజ్ఞానాన్ని ప్రత్యక్షంగా అనుభవించడమే ఈ సాధనా మార్గం యొక్క ప్రధాన ఆశయం. ఈ విధంగా శక్తిజాగరణ, సాధన, శరణాగతి, ఆత్మజ్ఞానం అనే నాలుగు ప్రధాన అంశాల సమన్వయంతో శక్తిపాత సిద్ధ మహాయోగం తన తాత్త్విక, ఆధ్యాత్మిక ప్రాతిపదికను నిర్మించుకుంది.

కుండలినీ శక్తి జాగరణ ఎందుకు తప్పనిసరి?

ఒక అద్భుతమైన దైవిక శక్తి మనందరి జీవితాల్ని నడిపిస్తుంది. ఆ దైవిక శక్తి ప్రతీ మానవునిలో నిద్రాణంగా ఉంటుంది. దానిని కుండలినీ శక్తి అంటారు. ఈ శక్తి అలా నిద్రాణంగా ఉండటం వలన మానవుడు "తానే స్వయంగా పరమాత్మను" అనే స్మృతిని కోల్పోయి ప్రాపంచిక విషయాల పట్ల మోహితుడై అనేక జన్మల నుంచి తనవి కాని తనవి అనుకుంటున్న సంస్కార, వాసన, గుణాల తో కర్మలు పోగు చేసుకుని జనన, మరణ చక్రంలో బందీ అవుతాడు. ఈ కర్మ చక్ర బంధిఖానా నుంచి బయటపడాలంటే కుండలినీ శక్తి జాగృతి జరగడం అనివార్యము. "సృష్టిలో ఉన్న ప్రతీ ఆత్మ యొక్క ఏకైక పరమ లక్ష్యము తాను పరమాత్మను అనే అనుభవంలోకి వెళ్లడమే. జన్మ తీసుకున్న ప్రతీ ఆత్మ కూడా తాను కాని, తనవి అనుకుంటున్న సత్వ, రజో, తమో గుణముల సంస్కారముల, వాసనల బందిఖానా నుండి విడుదల కావడాన్ని మోక్షము, జన్మరాహిత్యము లేదా కైవల్యము అంటారు."

ఎన్నో జన్మలకి కూడా సాధ్యపడని అతి కష్టమైన కుండలినీ శక్తి జాగరణ, శక్తిపాత సిద్ధ మహాయోగ మార్గం ద్వారా సిద్ధగురువు కృపతో తక్షణమే జరిగి గురువు యొక్క మార్గదర్శనంలో ఆత్మజ్ఞానాన్ని పొందుతూ అతి సులువుగా పరమాత్ముని తెలుసుకోగలుగుతాడు. ఈ శక్తి జాగరణతోనే సాధకుడికి ఆధ్యాత్మిక ప్రయాణం మొదలవుతుంది.



శక్తి జాగరణకు ముందు
(ఊహా చిత్రం)

వేదాంత దృక్పదంలో కుండలినీ శక్తిని సర్పముగా వర్ణించారు.

శక్తిపాత సిద్ధమహాయోగం అంటే ఏమిటి?


కుండలినీ శక్తి జాగృతమై, ఆత్మ సాక్షాత్కారమును పొందిన ఒక సిద్ధ గురువు తన ఆధ్యాత్మిక లక్ష్యాన్ని చేరుకోవాలనే తీవ్ర తపన ఉన్న అర్హత కలిగిన శిష్యునిలో నిద్రాణంగా ఉన్న కుండలినీ శక్తిని జాగృతమొనరించడాన్ని శక్తిపాతం అంటారు. శక్తిపాతము అంటే శక్తి పడుట అని అర్థము. శక్తి అంతటా నిండి ఉన్నది. అణువణువులోనూ నిండి ఉన్నది కానీ ఇది ఎక్కడి నుండి ఎక్కడ వరకు పడుతుంది లేక జారుతుంది అనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. గురువు యొక్క ఆత్మ శక్తి శిష్యుని యొక్క ఆత్మ శక్తిని మేల్కొల్పుటయే శక్తిపాతమునకు నిజమైన అర్థము. గురువు ఆధ్యాత్మిక దృష్టిలో పై స్థానము అంటే ఉన్నత స్థానమున ఉండుట మరియు శిష్యుడు క్రింది స్థానంలో ఉండుట జరుగుతుంది. అందువలన గురువు యొక్క శక్తి క్రింది స్థానంలో గల శిష్యుని చిత్తము పై జారుతూ శిష్యుని ఆత్మశక్తిని అంతర్ముఖముగా మేల్కొల్పి క్రియాశీలమైనదిగా చేస్తుంది. ఈ మేలుకొలుపునే శక్తిపాతము అంటారు. గురువు తన దృష్టి, స్పర్శ, శబ్దం మరియు సంకల్ప అను 4 విధములుగా సాధకుడికి శక్తిపాతం చేస్తారు. ఈ శక్తి జాగరణ తరువాత సాధకుని అంతర్ముఖ ప్రయాణం సహజంగా ప్రారంభమవుతుంది. గురువు యొక్క జ్ఞాన బోధ మరియు కృపతో సాధకుని నిరంతర సాధన ద్వారా ఆధ్యాత్మిక వికాసం జరుగుతుంది.



శక్తి జాగరణకు తరువాత
(ఊహా చిత్రం)

శక్తిపాత సిద్ధమహా యోగం యొక్క మూలము మరియు గురు పరంపర

ఈ మహా యోగానికి సాక్షాత్తు దక్షిణామూర్తి ఆది గురువు. వేదాలలో, గురుగీతలో, యోగవాసిష్టమ్ వంటి గ్రంథాలలో మొట్టమొదటిగా శివుడు పార్వతి దేవికి శక్తిపాత దీక్ష ఇచ్చినట్లుగా ప్రస్తావించడం జరిగింది. ప్రత్యేకంగా పార్వతీదేవికి, శక్తి జాగరణ అవసరం లేనప్పటికీ మానవాళి యొక్క ఆధ్యాత్మిక శ్రేయస్సు కోసం, మోక్షం పొందుటకు మరియు ఈ శక్తిపాత సిద్ధమహా యోగాన్ని కూడా ప్రారంభించడానికి శివుడు పార్వతీదేవికి మొట్టమొదటిగా దీక్షనివ్వడం జరిగింది.



ఆది గురువు శ్రీ దక్షిణామూర్తి




శ్రీ వశిష్టుల వారు

శ్రీ వశిష్టుల వారు శ్రీ రామునికి శక్తిపాతం చేసినట్లుగా యోగ వాశిష్టంలోనూ, శ్రీ అంగీరస మహర్షి శ్రీ కృష్ణునికి శక్తిపాతం చేసినట్లుగా భాగవతంలోనూ మరియు శ్రీ కృష్ణుడు అర్జునుడికి శక్తిపాతం చేసినట్లుగా మహాభారతంలోనూ తెలుపబడింది.

శ్రీ జమదగ్ని ఋషి

అయితే ఆది గురువు శ్రీ దక్షిణామూర్తి వారి నుండి శ్రీ జమదగ్ని ఋషికి, శ్రీ జమదగ్ని ఋషి నుండి ఎంతో మంది బ్రహ్మజ్ఞానులైన, సమర్థవంతమైన, శక్తిపాత సిద్ధ మహాయోగ గురు పరంపర కొనసాగుతూ వచ్చిందని చారిత్రకమైన ఆధారాల వలన తెలుస్తోంది.




పరమపూజ్య శ్రీ జమదగ్ని ఋషి

శ్రీ విశ్వనాథ మహర్షి మొదలు శ్రీ అయోధ్యాపురి, శ్రీ పరమానంద తీర్థ మహరాజ్, శ్రీ మహాయోగిని లల్, శ్రీ త్రైలోకి బాబా, శ్రీ ముకుంద తీర్థ మహారాజ్ గారి వరకూ ఈ మార్గం సమాజంలో అంతర్వాహినిగా కొనసాగుతూ వచ్చింది. అయితే శ్రీ గంగాధర తీర్థ మహారాజ్ గారి ద్వారా ఈ మార్గం 600 సంవత్సరాల క్రితం తిరిగి పునరుద్ధరించబడి ఆయన నుండి శ్రీశ్రీశ్రీ మహాయోగిని మహాలక్ష్మి గారి వరకు ఎంతోమంది సిద్ధ గురువులతో ఈ శక్తిపాత సిద్ధమహాయోగ మార్గం కొనసాగుతూ వస్తోంది.

పరమపూజ్యశ్రీ మహాయోగిని లల్లేశ్వరి దేవి :

పరమపూజ్య శ్రీ మహాయోగిని లల్లేశ్వరి దేవి (లాల్ డెడ్) క్రీ. శ. 1320–1392 మధ్య కాశ్మీర్, శ్రీనగర్ సమీపంలోని ఒక కాశ్మీర్ పండిత కుటుంబంలో జన్మించిన ఈమె చిన్న వయసులో సంపూర్ణ వైరాగ్యంతో ఇల్లు విడిచి పరమాత్మ అన్వేషణలో అడవుల బాట పట్టారు. లల్ యొక్క గురువుగారైన శ్రీ పరమానంద తీర్థ మహారాజు గారు తన పూర్వ జన్మలో తన గురువుగారైన నీలకంఠ స్వామి అని ఆమెకు గత స్మృతులు ఉండేవి. గురువుగారి దగ్గర శక్తిపాత దీక్ష తీసుకున్న తర్వాత అఖండ సాధన, గురువు పట్ల పూర్తి శరణాగతి, పరమాత్ముని చేతుకోవాలన్న తీవ్ర తపన వలన మోక్షం పొంది మహాయోగిని లాల్లేశ్వరిగా ప్రసిద్ధి చెందారు.

కాశ్మీర శైవ సంప్రదాయానికి చెందిన ఈమె, తన ఆధ్యాత్మిక అనుభవాలను 'లాల్ వాఖ్' వంటి అనేక ప్రసిద్ధి చెందిన పుస్తకాలు రచించారు.




పరమపూజ్య స్వామి శ్రీ గంగాధర తీర్థ మహారాజ్

శక్తిపాత సిద్ధ మహాయోగ గురు పరంపరలో పరమ పూజ్య శ్రీ గంగాధర తీర్థ మహారాజ్ గారి స్థానం అత్యంత విశిష్టమైనది. శతాబ్దాలుగా గురు–శిష్య పరంపరలో కొనసాగుతున్న ఈ రహస్య దివ్య జ్ఞానం ఆయన ద్వారా మళ్లీ పునరావృతం అయిన కారణంగా శ్రీ గంగాధర తీర్థ మహారాజ్ గారు ఆధునిక శక్తిపాత సిద్ధమహా యోగ గురు పరంపరకు మూలపురుషుడు గా ప్రసిద్ధి చెందారు. భవిష్యత్తు తరాలకి ఈ మార్గాన్ని అందించాలనే దివ్య సంకల్పంతో ఆయన జీవిత కాలంలో తన శిష్యుడు శ్రీ నారాయణ తీర్థ దేవ్ మహారాజ్ గారికి ఏకైక గురు దీక్షాధికారం ఇచ్చి తనను తాను ప్రపంచానికి ప్రకటితం చేసుకుని మానవ జాతి మీద కృప చూపించారు. అప్పటి నుండి ఈ పరంపర ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం ఆరంభమైంది.



పరమపూజ్య స్వామి శ్రీ నారాయణ దేవ్ తీర్థ మహారాజ్

శ్రీ స్వామి నారాయణ తీర్థ దేవ్ మహారాజ్ గురుపరంపర వైభవాన్ని విస్తరించిన మహాయోగి. చిన్న వయస్సు నుండి వైరాగ్యము, ఈశ్వరానురక్తి, ఆత్మ తత్వ జిజ్ఞాసలు వారియందు సహజ సిద్ధముగా వికసించెను. సంసార వైభవముల యందు ఆసక్తి చూపక పరమ సత్యాన్వేషణయే మానవ జీవితమునకు శ్రేష్ట పురుషార్థమని నిశ్చయించుకొని, యుక్త వయసు నుండి సత్యాన్వేషణకై దేశాంతర సంచారములు చేయుచు మహాత్ముల సత్సంగమములు, యోగ ధ్యాన, వేదాంతాది రహస్యములను అవగాహన చేసుకుని అంతిమముగా పరమ పూజ్య స్వామి గంగాధర తీర్థ మహారాజ్ వారి శ్రీ చరణ సన్నిధి యందు వారి ఆధ్యాత్మిక అన్వేషణ పరిపూర్ణత పొందెను. ఆ కాలమున శక్తిపాత సిద్ధమహా యోగ సాంప్రదాయము అత్యంత గోప్యముగా గురుపరంపరలోని కొద్దిమంది సిద్ధపురుషుల మధ్యనే పరిమితమై ఉండేది. స్వామి నారాయణ తీర్థదేవ్ మహారాజ్ వారి అవిరళ తపస్సు, గురుభక్తి, లోకహిత సంకల్పముల వలన మరుగున పడిన శక్తిపాత సిద్ధ మహా యోగ సంప్రదాయమునకు పునర్జీవనమును ప్రసాదించి, గురు కృపా మహిమను అనుభవ సిద్ధముగా లోకమునకు చాటిన మహనీయులలో పరమ పూజ్య స్వామి నారాయణ తీర్థదేవ మహారాజ్ వారికి అగ్రగణ్య స్థానము కలదు.


పరమపూజ్య స్వామి శ్రీ నారాయణ దేవ్ తీర్థ మహారాజ్


పరమపూజ్య స్వామి శ్రీ యోగేంద్ర విజ్ఞాని మహారాజ్

పరమపూజ్య స్వామి శ్రీ స్వామి యోగేంద్ర విజ్ఞాని మహారాజ్ గారు మంత్ర, హఠ యోగ వంటి అనేక ఆధ్యాత్మిక మార్గాలలో కఠోరమైన సాధనలు చేసి తన ఆధ్యాత్మిక తృష్ణ తీరక చివరికి, స్వామి నారాయణ తీర్థ దేవ్ మహారాజ్ గారి శ్రీ చరణ సన్నిధిని ఆశ్రయించి శక్తిపాత సిద్ధ మహాయోగ దీక్షను స్వీకరించారు. గురు కృపా ప్రభావము చే అంతర్ముఖ యోగ సాధనలో స్థిరపడి నిరంతర తపో నిష్ట ఫలితముగా ఆత్మానుభూతిని పొంది గురువుల అనుగ్రహముతో సిద్ధ గురువుగా మహోన్నత స్థితిని అధిరోహించారు. శిష్యుని అంతఃకరణ శుద్ధి, గురుభక్తి, నిరంతర సాధన, అంతర్ముఖ పరివర్తనలనే నిజమైన పునాదులుగా స్థాపించారు. సాధకులు యోగానుభూతుల యందు ఆసక్తి పెంచుకొనక గురువుపై అచంచల విశ్వాసముతో నిత్య సాధనలో నిలిచి ఆత్మజ్ఞానమునే పరమ లక్ష్యముగా స్వీకరించవలెనని సదా ఉపదేశించుచూ ఉండేవారు. సన్యాస జీవితం మీద ఎంతో మక్కువ ఉన్నప్పటికీ గురువు ఆజ్ఞ మేరకు గృహస్థాశ్రమంలో ఉంటూనే పరమాత్మను చేరుకోవచ్చనే మార్గాన్ని ఆచరించి మార్గదర్శనం చేశారు. వారి గురుదేవుల ఆజ్ఞ మేరకు వేదాల, ఉపనిషత్తుల సారాంశాన్ని, యోగ విజ్ఞానాన్ని జిజ్ఞాసువులకు, యోగ సాధకులకు దిశా నిర్దేశం చేసేలా "మహాయోగ విజ్ఞాన్" అనే గ్రంథాన్ని రచించారు.



పరమపూజ్య స్వామి శ్రీ విష్ణు తీర్థ మహారాజ్

పరమపూజ్య స్వామి శ్రీ విష్ణు తీర్థ మహారాజ్ గారు బాల్యము నుండియే వైరాగ్యము, ఈశ్వర భక్తి, ధ్యానముల యందు సహజానురక్తి కలిగి యుండేవారు. విద్యార్థి దశలో వారికి కలిగిన ఒక దివ్యానుభూతి వారి అంతరంగమున ఆధ్యాత్మిక జిజ్ఞాసను మరింత ప్రగాఢముగా చేసి సద్గురువు అన్వేషణకు ప్రేరణను ఇచ్చింది. ఆ దివ్య అన్వేషణ అంతిమముగా శ్రీ యోగేంద్ర విజ్ఞాని మహారాజ్ వారి శ్రీ చరణ సన్నిధి యందు పరిపూర్ణతను పొందింది. గురు కృపా ప్రసాదముగా శక్తిపాత సిద్ధమహా యోగ దీక్షను స్వీకరించి, నిరంతర యోగ సాధన ఫలితముగా ఉన్నత ఆధ్యాత్మిక స్థితిని అధిరోహించి, గురువుల అనుగ్రహముచే సిద్ధ గురువుగా అవతరించి, శక్తిపాత సిద్ధ మహా యోగ గురుపరంపర బాధ్యతలను స్వీకరించారు. క్రీ.శ. 1951 వ సంవత్సరమున మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దేవాస్ నగరమున శ్రీ నారాయణ కుటి సన్యాస ఆశ్రమమును స్థాపించి శక్తిపాత సిద్ధమహా యోగ ప్రచారానికి శాశ్వత పునాదిని ఏర్పరిచారు. శ్రీ స్వామి విష్ణు తీర్థ మహారాజ్ గారు శక్తిపాత యోగాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసిన మహా గురువు. అనేక గ్రంథాలను రచించి సాధకులకు యోగసాధనలో మార్గదర్శకత్వం వహించారు. గురుపరంపరను విశ్వవ్యాప్తంగా విస్తరించడంలో ఆయన విశేష సేవ చేశారు.



పరమపూజ్య స్వామి శ్రీ విష్ణు తీర్థ మహారాజ్

పరమపూజ్య స్వామి శ్రీ శివోం తీర్థ మహారాజ్

పరమ పూజ్య స్వామి విష్ణు తీర్థ మహారాజ్ గారి ప్రత్యక్ష శిష్యులై శక్తిపాత దీక్ష మరియు యోగ రహస్యమును స్వీకరించి గురుసేవ, తపస్సు నిత్యసాధనల ద్వారా సిద్ధ గురువుగా ఆవిర్భవించారు. యుక్త వయస్సు నుండి ఆధ్యాత్మిక జీవనమునకు ఆకర్షితులై పరమ సత్యాన్వేషణలో గురు సన్నిధిని ఆశ్రయించారు. గురు చరణ సేవనే జీవిత పరమ ధర్మముగా స్వీకరించి వినయము, శరణాగతి గురు నిష్టలతో యోగ సాధనలో పరిపక్వతను పొందారు. గురుదేవుల ఆజ్ఞానుసారము శక్తిపాత సిద్ధమహా యోగ గురుపరంపర బాధ్యతలను స్వీకరించి ఆ పవిత్ర సాంప్రదాయాన్ని విశ్వవ్యాప్తంగా విస్తరించుటకు అవిరళ కృషి చేసారు. వారి మార్గదర్శకత్వమున అనేక రాష్ట్రాలలో,దేశవిదేశాలలో ఎన్నో ఆశ్రమములు, ధ్యాన కేంద్రాలు, సాధన పీఠములు ఆధ్యాత్మిక వికాసమునకు పవిత్ర క్షేత్రములుగా అభివృద్ధి చెందాయి. ఆశ్రమము అనునది కేవలం నిర్మాణము కాదు గురు సన్నిధిని అనుభవించి, సాధన ద్వారా ఆత్మసాక్షాత్కార మార్గమున పురోగమించు దివ్య క్షేత్రమని వారు నిరంతరము ఉపదేశించారు.

ఆయన వివిధ భాషల్లో చేసిన రచనలు మరియు ప్రవచనాలు వివిధ ప్రాంతాల్లో ఉన్న సాధకులకు ఇప్పటికీ అపూర్వమైన ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నాయి. గురుకృపే మోక్షమార్గానికి మూలమని ఆయన జీవిత పర్యంతం బోధించారు.



పరమపూజ్య స్వామి శ్రీ శివోం తీర్థ మహారాజ్

పరమపూజ్య స్వామి శ్రీ సహజానంద తీర్థ మహారాజ్

పరమపూజ్య స్వామి శ్రీ సహజానంద తీర్థ మహారాజ్ గారు బాల్యము నుండి ఈశ్వర భక్తి, ధ్యాననిష్ట ఆత్మ తత్వ జిజ్ఞాసలతో జీవించారు. పరమ సత్యాన్వేషణలో దేశం నలుమూలలా తిరిగి అనేక మహాత్ముల సన్నిధిని ఆశ్రయించారు. శ్రీ అరవిందో, శ్రీ రమణ మహర్షి, స్వామి భాస్కరానంద తీర్థ మహారాజ్ వంటి మహనీయుల సత్సంగము వారి ఆధ్యాత్మిక పరిపక్వతకు పునాది అయి నిలిచింది.చివరకు పరమ పూజ్య స్వామి శివోం తీర్థ మహారాజ్ గారి శిష్యులై శక్తిపాత సిద్ధ మహా యోగ రహస్యమును స్వీకరించి దానిని దక్షిణ భారతదేశమున ముఖ్యముగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తరింప చేసిన విశిష్ట గురువుగా ప్రసిద్ధి పొందారు. శ్రీ స్వామి సహజానంద తీర్థ మహారాజ్ గారు సహజత్వం, కరుణ మరియు గురు భక్తికి ప్రతిరూపం. శక్తిపాత సిద్ధ మహాయోగ తత్వములను ప్రజలకు సులభముగా అర్థం అయ్యేలా గురుశిష్య సంబంధము, కుండలినీ జాగరణ, సాధన రహస్యాలను తన ప్రవచనాల మరియు సత్సంగాల ద్వారా స్పష్టంగా వివరించారు. వారి అవిరళ కృషి వలన శక్తిపాత సిద్ధమహా యోగ సందేశమును విస్తరింప చేసి అనేకమంది తెలుగు సాధకులకు ఈ దివ్య గురుపరంపరను పరిచయము చేసారు. వారి అనుగ్రహముతో ఆంధ్ర ప్రదేశ్ తో పాటు ఇతర ప్రాంతములలోను శక్తిపాత సిద్ధమహా యోగము స్థిరముగా వృద్ధి చెందింది.



పరమపూజ్య స్వామి శ్రీ సహజానంద తీర్థ మహారాజ్

పరమపూజ్య స్వామి శ్రీ కల్నల్ టి. శ్రీనివాసులు (రిటైర్డ్)

పరమపూజ్య స్వామి శ్రీ కల్నల్ టి శ్రీనివాసులు (రిటైర్డ్) గారి జీవితం విధి,క్రమశిక్షణ, దేశభక్తి మరియు దైవానుగ్రహానికి ఒక నిదర్శనం. ఆయన సాధన ప్రయాణం,గురు సేవ మరియు పూర్తి శరణాగతి ద్వారా సాధ్యపడింది.1986వ సంవత్సరములో, రైలు ప్రయాణంలో శ్రీ సహజానంద తీర్థ మహారాజ్ గారి కృప వలన వీరికి గురువు గారి దివ్య దర్శన భాగ్యం కలగడం,గురువు గారు వీరిలో ఆధ్యాత్మిక బీజం నాటడం జరిగింది. సరిగ్గా 21 సంవత్సరాల తర్వాత అంటే 2007వ సంవత్సరంలో గురువు గారి పునర్దర్శనం లభించింది. గురువు గారి కృపా అనుగ్రహము చేత శక్తిపాత దీక్ష పొందడంతో ఆ ఆధ్యాత్మిక బీజం అంకురించడం ప్రారంభించింది. 2014లో దీక్ష పొందిన ఏడేళ్ల తర్వాత, తన లోతైన అంతర్గత అనుభవాలను అక్షరబద్ధం చేయవలసినది అన్న గురువు గారి ఆదేశానుసార ఫలితంగా ఆయన మొదటి పుస్తకం The Power Unknown to God, తెలుగు లో పరాశక్తి గా రూపుదిద్దుకుంది. ఈ పుస్తకం భారతీయ ప్రాంతీయ భాషలలోనూ ఫ్రెంచ్, లాటిన్ ,వియత్నామీస్ లాంటి అనేక ప్రపంచ భాషలలోనూ ప్రచురించబడింది. 2019లో శ్రీ కల్నల్ టి. శ్రీనివాసులు గారు స్వామి సహజానంద తీర్థ మహారాజ్ గారి నుండి శక్తిపాత గురు దీక్షాధికారాన్ని పొందారు. ఆయన జాతి మరియు మతాల సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శిష్యులకు శక్తిపాత దీక్షను ఇచ్చారు. అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను వివిధ ప్రపంచ భాషలలో రచించి ఎన్నో దేశస్తులకు శక్తిపాత దీక్ష మరియు గురు దీక్షాధికారాన్ని ఇస్తూ ఆయా దేశాలలో ఈ మార్గాన్ని విస్తృతంగా వ్యాప్తి చేశారు.ఈ విదేశస్తుల ద్వారా అనేక దేశాలలో ఆశ్రమాలు నెలకొల్పబడి దీక్షలు తీసుకొనే అనేకమంది శిష్యులతో దినదినాభివృద్ధి చెందుతున్నాయి. వీరు తన సత్సంగాల ద్వారా ప్రపంచంలోని అనేక దేశస్థుల కోసం కుండలినీ శక్తి విజ్ఞానాన్ని సరళమైన పదాలలో వివరిస్తున్నారు. శ్రీ కల్నల్ టి. శ్రీనివాసులు (రిటైర్డ్) గారు భౌతిక మరియు ఆధ్యాత్మిక ప్రపంచాల మధ్య ఒక అరుదైన వారధిగా నిలిచారు. శ్రీ కల్నల్ టి. శ్రీనివాసులు గారు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా శక్తి పాత సిద్ధ మహా యోగాన్ని ప్రచారం చేస్తున్నారు.


పరమపూజ్య శ్రీ కల్నల్ టి. శ్రీనివాసులు (రిటైర్డ్)

పరమ పూజ్యశ్రీ మహాయోగిని మహాలక్ష్మి :

పరమ పూజ్య శ్రీ మహాయోగిని మహాలక్ష్మి గారు 1977లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా హీరమండలం ప్రాంతంలో ఒక సనాతన ధార్మిక కుటుంబంలో జన్మించారు. చిన్ననాటి నుండే ఆధ్యాత్మిక చింతన, ఈశ్వరానురక్తి, ఆత్మజ్ఞానంపై అపారమైన ఆసక్తి కలిగి ఉండేవారు. ఐదేళ్ల వయస్సు నుండే తల్లిగారైన శ్రీమతి భాగ్యలక్ష్మి గారి మార్గదర్శకత్వంలో పురాణాలు, సత్సంగాలు, ఆధ్యాత్మిక సాధనలతో పరిచయం ఏర్పడింది. ఏడేళ్ల వయస్సులోనే సీది గురువుగారి దగ్గర తొలి మంత్ర దీక్షను స్వీకరించి ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రారంభించారు.

ఆత్మతత్వం, సృష్టి రహస్యం, పరమ సత్యాన్ని తెలుసుకోవడానికి మరియు ఆధ్యాత్మిక దాహం తీరడానికి ప్రత్యక్షంగా సుమారుగా 13 ఆధ్యాత్మిక సంస్థలకు సంబంధించిన సాధన చేస్తూ, పరోక్షంగా ఇంకా ఎన్నో సాధనా మార్గాలలో సాధన చేశారు. ఈ అన్ని మార్గాలలో గురువుల వద్ద అత్యంత సూక్ష్మాతి సూక్ష్మమైన రహస్యాలను తెలుసుకున్నారు. దేశ విదేశాల్లో సేవలు అందించారు. అయినా ఆధ్యాత్మిక తృష్ణ మాత్రం తీరలేదు.

2019లో పరమ పూజ్య శ్రీ కల్నల్ టి. శ్రీనివాసులు గారితో పరిచయం వారి ఆధ్యాత్మిక జీవితంలో ఒక గొప్ప మలుపుగా నిలిచింది. 2020 మే నెలలో వారి వద్ద శక్తిపాత దీక్షను స్వీకరించి, 2021లో గురు దీక్షా అధికారాన్ని పొందారు.

గురువుల అనుగ్రహంతో నేడు శక్తిపాత సిద్ధ మహాయోగ పరంపరలో దీక్షాధికార గురువుగా అనేకమంది సాధకులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తున్నారు. పుస్తకాలు, సత్సంగాలు, ఆన్‌లైన్ తరగతులు, పోడ్‌కాస్ట్‌లు, యూట్యూబ్ ద్వారా కుండలినీ శక్తి జాగరణ, శక్తిపాతం, ఆత్మజ్ఞానం, సృష్టి రహస్యాలను సరళమైన భాషలో వివరిస్తూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తున్నారు.

గురుకృప, నిరంతర సాధన, సంపూర్ణ శరణాగతి ద్వారా ఆత్మసాక్షాత్కారమే మానవ జీవిత పరమ లక్ష్యం అనే సందేశాన్ని తమ బోధనల ద్వారా అందిస్తున్నారు.

శక్తిపాత సిద్ధ మహాయోగ గురుపరంపరలోని దివ్యజ్ఞానాన్ని భావితరాలకు అందిస్తూ, ఎందరో సాధకుల ఆధ్యాత్మిక ఉన్నతికి మార్గదర్శకులుగా నిలుస్తున్న శ్రీ మహాయోగిని మహాలక్ష్మి గారి జీవితం గురుభక్తికి, గురుసేవకు, సాధనకు, శరణాగతికి ఒక సజీవ స్ఫూర్తి.



దీక్షార్థుల తప్పక గ్రహించవలసిన విషయాలు :

శక్తిపాత సిద్ధమహాయోగ మార్గం మతం, కులం, జాతి, భాష, దేశం లేదా వృత్తి వంటి ఎటువంటి భేదాలకు అతీతమైన సనాతన ఆధ్యాత్మిక మార్గం. పరమాత్మ తత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవించాలని తీవ్రమైన ఆకాంక్ష కలిగి, ఆధ్యాత్మిక సాధన పట్ల శ్రద్ధ, నిరంతరత, ఆత్మజ్ఞానంపై ఆసక్తి, గురుతత్వం పట్ల సంపూర్ణ భక్తి మరియు శరణాగతి కలిగిన ఏ వ్యక్తికైనా ఈ మార్గం అందుబాటులో ఉంటుంది. సత్యాన్వేషణను జీవిత పరమలక్ష్యంగా స్వీకరించిన ప్రతి జిజ్ఞాసువుకు ఈ మార్గం ఆత్మసాక్షాత్కార దిశగా నడిపించే దివ్య అవకాశాన్ని అందిస్తుంది.

శక్తిపాత దీక్ష అనేది కేవలం కోరిక లేదా అభ్యర్థన ఆధారంగా ఇవ్వబడేది కాదు. సాధకుని ఆధ్యాత్మిక పరిపక్వత, అంతర్గత సిద్ధత మరియు ఆధ్యాత్మిక ప్రయాణాన్ని గురువు అంతర్దృష్టితో పరిశీలించి, ఆ సాధకునికి దీక్ష ప్రసాదించవలెనని సిద్ధగురువుకు అంతఃస్ఫురణ కలిగినప్పుడే గురుకృపతో శక్తిపాత దీక్ష ప్రసాదించబడుతుంది. కాబట్టి, దీక్ష అనేది పూర్తిగా సిద్ధగురువు అనుగ్రహం మరియు సంకల్పంపై ఆధారపడి ఉంటుంది.

సాధకుడు ఆశ్రమానికి ప్రత్యక్షంగా రావడానికి అవకాశం ఉన్నట్లయితే, గురుమా గారు నిర్ణయించిన తేదీన ఆశ్రమానికి వచ్చి ప్రత్యక్ష దీక్ష స్వీకరించవచ్చు. ఒకవేళ వ్యక్తిగత కారణాల వల్ల ఆశ్రమానికి రావడం సాధ్యం కానట్లయితే, సాధకుడు ఉన్న ప్రదేశం నుంచే ఆన్‌లైన్ ద్వారా కూడా దీక్ష స్వీకరించవచ్చు. కాబట్టి, దీక్ష తప్పనిసరిగా ఆశ్రమంలోనే తీసుకోవాలనే నియమం లేదు.

దీక్షకు ముందు సాధకుడు తన ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలియజేయాలి. అలాగే ఈ మార్గంలో ప్రవేశానికి సాధారణంగా 21 నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. ఇతర ఆధ్యాత్మిక లేదా సాధనా మార్గాలలో ఇప్పటికే ప్రవేశం ఉన్నట్లయితే, ఆ విషయాన్ని కూడా ముందుగానే ఆశ్రమానికి తెలియజేయడం అవసరం. ఈ వివరాలు సాధకుని ఆధ్యాత్మిక ప్రయాణానికి తగిన మార్గదర్శకత్వాన్ని అందించేందుకు ఉపయోగపడతాయి.


శ్రీ మహా సిద్ధాశ్రమ సిద్ధాంతాలు




- శ్రీ మహా సిద్ధాశ్రమం, ప్రాచీన గురు పరంపర ఆశీస్సులతో శక్తిపాత సిద్ధ మహా యోగాన్ని నడిపిస్తోంది.
- ప్రాచీన శక్తిపాత సిద్ధ మహాయోగ సాంప్రదాయము,సిద్ధాంతములు మరియు సనాతన ఆధ్యాత్మిక విద్య పరిరక్షించడం.
- గురు-శిష్య పరంపర వైభవాన్ని కొనసాగించడం.
- శక్తిపాత దీక్ష ద్వారా ఆధ్యాత్మిక మార్గాన్ని అందిస్తూ పరమ లక్ష్యమైన మోక్షానికి పూర్తి మార్గదర్శనాన్ని అందించడం.
- నిత్య ధ్యాన సాధనను ప్రోత్సహించడం.
- ధర్మబద్ధమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం.

ఆశ్రమంలో నిర్వహించే కార్యక్రమాలు

- సామూహిక శక్తిపాత దీక్షలు
- సామూహిక ధ్యానాలు
- సత్సంగాలు
- ఆధ్యాత్మిక ప్రవచనాలు
- శాస్త్ర అధ్యయనం
- ధ్యాన శిబిరాలు
- గురువుల ప్రత్యేక పుణ్య తిథులు, గురుపూర్ణిమ మహోత్సవాలు

"ప్రతీ సాధకుడు ఆత్మసాక్షాత్కార మార్గంలో స్థిరంగా పయనించి తానే పరమాత్మనే అనుభవంలోకి వచ్చు గాక."






దక్షిణామూర్తి
Dakshinamurthy

పరమపూజ్య శ్రీ జమదగ్ని ఋషి
P.P. Sri Jamadagni Rushi

పరమపూజ్య మహాగురువు శ్రీ విశ్వనాథ
P.P. Mahaguru Sri Viswanatha

పరమపూజ్య శ్రీ అయోధ్యాపురి
P.P. Sri Ayodhyapuri

స్వామి శ్రీ పరమానంద తీర్థ మహారాజ్
Swami Sri Paramanandha Theerth Maharaj

మహాయోగిని లల్లేశ్వరి
Mahayogini Lalleswari

స్వామి శ్రీ ముకుంద తీర్థ మహారాజ్
Swami Sri Mukunda Theerth Maharaj

శ్రీ త్రైలోకి బాబా
Sri Triloki Baba

స్వామి శ్రీ గంగాధర్ తీర్థ మహారాజ్
Swami Sri Gangadhar Theerth Maharaj

స్వామి శ్రీ నారయణ్ దేవ్ తీర్థ మహారాజ్
Swami Sri Narayan Dev Theerth Maharaj

స్వామి యోగేంద్ర విజ్ఞాని మహారాజ్
Swami Sri Yogendra Vignani Maharaj

స్వామి శ్రీ విష్ణు తీర్థ మహారాజ్
Swami Sri Vishnu Theerth Maharaj

స్వామి శ్రీ శివోం తీర్థ మహారాజ్
Swami Sri Shivom Theerth Maharaj

స్వామి శ్రీ సహజానంద తీర్థ మహారాజ్
Swami Sri Sahajanandha Theerth Maharaj

కల్నల్ టి. శ్రీనివాసులు (లైట్కు)
Colonel T. Srinivasulu (Retd)

మహాయోగిని మహాలక్ష్మి
Mahayogini Mahalakshmi



SRI MAHA SIDDHA ASHRAM

ANDHRA PRADESH.

Contact us : 94915 52378

website : srimahasiddhaashramam.com